APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com   తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి   ఎడిటర్ : సి హరికృష్ణ   సోమవారం 03 ఆగస్టు 2026   సంపుటి: 01   సంచిక :67   పేజీలు : 04   వెల: 2-00/-



## జైషే కుట్రలో హమీమ్ అరెస్ట్

- జంతర్‌మంతర్ ఆందోళనల్లో అల్లర్లకు కుట్ర చేసినట్లు ఆరోపణలు
- రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకున్న ప్రణాళికలపై దర్యాప్తు
- ప్రియురాలితో కలిసి హనీట్రాప్, ఉగ్ర నియామకాల యత్నం
- పాకిస్థాన్ హ్యాండ్లర్లతో ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా సంబంధాలు

కోల్‌కతా, ఆగస్టు 2 : పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రసంస్థతో సంబంధాలు ఉన్న హమీమ్ మోండల్‌ను, అతనికి సహకరించిన జార్ఖండ్‌కు చెందిన యువతి అర్పిత సర్కార్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారులు పలు కీలక విషయాలను వెల్లడించారు. దేశంలో అల్లర్లు సృష్టించడం, రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకోవడం వంటి కుట్రలకు సంబంధించి నిందితుల పాత్రపై లోతుగా విచారణ కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు సృష్టించేందుకు హమీమ్‌కు జైషే మహ్మద్ హ్యాండ్లర్ల నుంచి ఆదేశాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పోలీసు యూనిఫామ్ ధరించి నిరసన ప్రదేశంలోకి ప్రవేశించాలని, అందుకోసం మహిళలు, పురుషులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించినట్లు వెల్లడించారు. నిందితులు నిజంగా ఢిల్లీకి వెళ్లారా లేదా అనే అంశంపై వారి డిజిటల్ కమ్యూనికేషన్‌ను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ రాజకీయ నాయకుల కదలికలపై సమాచారం సేకరించాలని కూడా హ్యాండ్లర్లు హమీమ్‌ను ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రతిపక్ష నేత సువేంధు అధికారికి భద్రత తక్కువగా ఉండే ప్రాంతాల వివరాలు తెలుసుకోవాలని సూచించినట్లు విచారణలో వెల్లడైంది.

## రియల్ ఎస్టేట్ వెంచర్ ప్రారంభం




- మచిలీపట్నంలో కుభేరా ఎంపైర్ వెంచర్ ప్రారంభోత్సవం
- పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర
- నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి
- నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్ష

విమచిలీపట్నం, ఆగస్టు 2 : మచిలీపట్నంలోని సుమ కన్వెన్షన్‌లో నిర్వహించిన కుభేరా ఎంపైర్ రియల్ ఎస్టేట్ వెంచర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజలకు విశ్వసనీయమైన, నాణ్యమైన సేవలు అందిస్తూ సంస్థ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునే వారికి మెరుగైన వసతులు, పారదర్శక సేవలు అందించేందుకు సంస్థ కృషి చేయాలని మంత్రి సూచించారు. వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రియల్ ఎస్టేట్ రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించే వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



## అక్రమ అరెస్టును ఖండించిన వైఎస్సార్సీపీ

- చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన కాటసాని
- అర్ధరాత్రి అరెస్టు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శ
- రాజకీయ కక్షసాధింపుతో కేసులు పెట్టారన్న ఆరోపణ
- పార్టీ నేతలతో కలిసి మీడియా సమావేశం

కర్నూలు, ఆగస్టు 2: ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఆయన కుమారుడి అరెస్టును వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన అనంతరం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విరూపాక్షి, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను అర్ధరాత్రి సమయంలో భారీ పోలీసు బలగాలతో అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాటసాని ఆరోపించారు. నివాసం తలుపులు బద్దలు కొట్టి ఇంట్లోకి ప్రవేశించి అరెస్టు చేయడం అన్యాయమని విమర్శించారు. చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో వైఎస్సార్సీపీ నాయకుడు గిరి ఇంటిపై దాడి జరిగిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎమ్మెల్యే విరూపాక్షి వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాముడు గాయపడ్డారని పేర్కొన్నారు.

## అవయవ దానంపై అవగాహన పెంచాలి



- విశాఖలో అవయవ దాన అవగాహన సదస్సులో మంత్రి సత్యకుమార్ యాదవ్
- ఒక దాత ఎనిమిది మందికి ప్రాణదాత కావొచ్చని వ్యాఖ్య
- రాష్ట్రంలో అవయవ మార్పిడి కేంద్రాలు 3 నుంచి 9కు పెంపు
- అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు

విశాఖపట్నం, ఆగస్టు 2 : విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అవయవ దాన అవగాహన సదస్సులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. మంత్రి మాట్లాడుతూ, అవయవ దానం మహోన్నతమైన మానవతా సేవ అని పేర్కొన్నారు. ఒక అవయవ దాత ఏకంగా ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపగలడని, సమాజంలోని ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై విస్తృతంగా అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

## ఇంటింటికీ టీడీపీకి విశేష స్పందన

- <u>ఏడో రోజుకు చేరిన 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం</u>
- <u>17.61 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి శ్రేణులు</u>
- <u>ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించిన నాయకులు</u>
- <u>కార్యక్రమ పురోగతిపై సమీక్ష నిర్వహించిన పార్టీ నాయకత్వం</u>



అమరావతి, ఆగస్టు 2 : అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ -- రెండు ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు పార్టీ నాయకత్వం తెలిపింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 17,61,197 ఇళ్లను సందర్శించి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించినట్లు వెల్లడించింది. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించినట్లు పార్టీ పేర్కొంది. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి అంశాల్లో ప్రభుత్వం సాధించిన పురోగతిని ప్రజలకు వివరించినట్లు తెలిపింది. వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను గణాంకాలతో సహా ప్రజలకు వివరిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకుంటూ, వారి సూచనలను నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికి చేరుకుని ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

## జనసేన లీగల్ సెల్‌కు దిశానిర్దేశం

- న్యాయవాదుల సేవలు పార్టీకి కీలకమన్న పిడుగు హరిప్రసాద్
- కార్యకర్తలపై నమోదైన కేసుల వివరాలు సేకరించాలని సూచన
- పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలపై వెంటనే ఫిర్యాదు చేయాలని పిలుపు
- చట్టపరమైన సహాయానికి ప్రత్యేక కార్యాచరణ

తాడేపల్లి, ఆగస్టు 2 : న్యాయవాదుల సేవలు లేకుండా ఏ రాజకీయ పార్టీ సమర్థవంతంగా ముందుకు సాగలేదని జనసేన పార్టీ అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి, శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్ అన్నారు.



మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లిలో కృష్ణా, గుంటూరు జిల్లాల హైకోర్టు న్యాయవాదులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకలాపాలు, ఎన్నికల ప్రక్రియ, ప్రజా సమస్యల పరిష్కారం, చట్టపరమైన సవాళ్లను ఎదుర్కోవడంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమని హరిప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో న్యాయవాదుల పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు కొత్త న్యాయవాదులను లీగల్ సెల్‌లోకి ఆహ్వానించాలని సూచించారు. జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినా లేదా దూషించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునేలా వ్యవహరించాలని పార్టీ న్యాయవాదులకు పిలుపునిచ్చారు. చట్టబద్ధమైన మార్గంలోనే ఇటువంటి అంశాలను ఎదుర్కోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై రాజకీయ కక్షసాధింపుతో నమోదైన కేసుల పూర్తి వివరాలను జిల్లాల వారీగా సేకరించి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించాలని కోరారు. ఏ కోర్టులో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయో సమగ్ర నివేదిక సిద్ధం చేసి, వారికి న్యాయ సహాయం అందించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# జిల్లా కేంద్రంలో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



♦ రేవెన్యూ భవన్‌లో నిర్వహణ - ప్రజలకు కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ సూచనలు

పుట్టపర్తి, ఆగస్టు 2 అనంత సూర్య:శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలోని పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రేవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్)లో సోమవారం (ఆగస్టు 3) జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత వేదికకు హాజరుకావాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ దరఖాస్తులను జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. అర్జీదారులు ముందుగా తమ సమస్యలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలతోనే జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. రేవెన్యూ భవన్‌లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదేశించారు.

# యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా రాజా యాదవ్





అనంతపురం, ఆగస్టు 2, అనంత సూర్య : అనంతపురం జిల్లా యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా రాజా యాదవ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలోని నక్కా రామారావు యాదవ భవన్ లో ఏర్పాటు చేసిన జిల్లా యాదవ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, రాష్ట్ర నాయకులు రాజశేఖర్ యాదవ్, నారాయణ స్వామి యాదవ్ తదితరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా జిల్లా, మండల కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం యాదవ సంఘం నేతలు మాట్లాడుతూ రాజా యాదవ్ గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టు గా కొనసాగుతూ, అనంతపురంలో అందరికీ సుపరిచితుడని, ఇప్పుడు యాదవుల ఐక్యతకు కృషి చేస్తూ సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. అనంతరం రాజా యాదవ్ మాట్లాడుతూ తనకు యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు యాదవ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, యాదవ సోదరుల ఐక్యతకు కృషి చేస్తూ, వారి సమస్యలపై పోరాడడానికి నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. అందులో భాగంగానే త్వరలో జిల్లాలోని అన్ని మండలాలలో అన్ని రకాల కమిటీలు వేయడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో యాదవులు ఏ పార్టీలో ఉన్నా వారి బలోపేతానికి కృషి చేస్తామని యాదవ పెద్దలు తెలిపారు. యాదవులకు ఏ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీకే యాదవుల మద్దతు ఉ ంటుందని తెలిపారు. అనంతరం యాదవ సంఘం నూతన కమిటీని పలువురు అభినందించారు.

# బళ్లారి రాఘవ జీవితం నేటి యువతకు స్ఫూర్తి

**- జిల్లా రెవెన్యూ అధికారి మాలోల**

అనంతపురం, ఆగస్టు 2 అనంత సూర్య:తెలుగు నాటకరంగ మహానటుడు బళ్లారి రాఘవ జీవితం, ఆయన ఆదర్శాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి మాలోల అన్నారు. ఆదివారం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో బళ్లారి రాఘవ 146వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్ఓ మాలోల బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు నాటకరంగానికి బళ్లారి రాఘవ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నటుడిగా మాత్రమే కాకుండా సమాజ సంస్కర్తగా, మేధావిగా, వక్తగా, రచయితగా, దాతగా ఆయన విశిష్ట గుర్తింపు పొందారని తెలిపారు. 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించిన బళ్లారి రాఘవ చిన్న వయస్సులోనే నాటకరంగంలో ప్రవేశించి తన అసాధారణ నటన, వాక్చాతుర్యంతో ప్రేక్షకుల మన్ననలు పొందారని చెపా-ఎరు. హరిశ్చంద్ర, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, బృహన్నల, రామరాజు చరిత్ర, రామదాసు, తప్పెవరిది, సరిపడని సంగతులు వంటి నాటకాల ద్వారా విశేష ఖ్యాతి గడించారని పేర్కొన్నారు. బళ్లారి రాఘవ నటనను జాతిపిత మహాత్మా గాంధీ సైతం ప్రశంసించారని, నాటకరంగం ద్వారా సంపాదించిన ధనాన్ని ప్రజా సంక్షేమానికి వినియోగించిన మహోన్నత వ్యక్తిగా నిలిచారని డీ ఆర్ఓ తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమానికి మద్దతు తెలుపుతూ, మహిళా విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు తెలుగు సాహిత్య వికాసానికి విశేష కృషి చేశారని అన్నారు. ప్రతి విద్యార్థి బళ్లారి రాఘవ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని కళ, సాహిత్యం, దేశభక్తి, నైతిక విలువలను



అలవర్చుకోవాలని, ఆయన చూపిన మార్గం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని మాలోల ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి రమణరెడ్డి, లలిత కళా పరిషత్ కార్యదర్శి పద్మజ, ఆన్‌సెట్ మేనేజర్ శ్రీనివాసులు, యువజన సంక్షేమశాఖ సూపరింటెండెంట్ అన్వర్ బాషా, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ కళా సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వన్నూర్ హజ్రత్ సర్మాస్ వలి రహమతుల్లాహి దర్గాలో టీడీపీ నాయకుల ప్రత్యేక ప్రార్థనలు





రాయదుర్గం, ఆగస్టు 2 అనంత సూర్య:రానున్న అనంతపురం అర్బన్ మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించాలని ఆకాంక్షిస్తూ రాయదుర్గం నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వన్నూర్ హజ్రత్ ఖాజా సయ్యద్ షా శర్మాస్ వలి హుసేని చిస్తీ దర్గాలో టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రం, జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, అనంతపురం అర్బన్ ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలని దర్గా వద్ద ప్రత్యేక దువా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాలార్ భాషా, నియాజ్, అంగిడి ఇషాక్, రమేష్, రాయల్ మధు, ఇస్మాయిల్ ఆజాద్, కరీముల్లా, మహబూబ్ ఖాన్, ఎల్లనూరు రియా-జుద్దీన్, అఫ్జల్, ఇనాయతుల్లా, పూల బాషా, రాణినగర్ అల్తాఫ్, కేకే ఖాదర్, షామీర్ భాషా, ముక్తియార్, జాకీర్, మణికుమార్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం: వాల్మీకి శంకర

పుట్టపర్తి, ఆగస్టు 2 అనంత సూర్య:ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ని అర్ధరాత్రి సమయంలో ఇంటి తలుపులు పగలగొట్టి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ వాల్మీకి శంకర పేర్కొన్నారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ అరెస్టు జరిగినట్లు కనిపిస్తోందని అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిని అవమానించడం అంటే



ప్రజాస్వామ్య వ్యవస్థను, ప్రజల తీర్పును అవమానించినట్లేనని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించాల్సిన ప్రభుత్వం, కక్షసాధింపు చర్యలకు పాల్పడడం ఆందోళనకరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని హెచ్చరించారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ని వెంటనే విడుదల చేయాలని, రాజకీయ కక్షసాధింపు చర్యలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని వాల్మీకి శంకర డిమాండ్ చేశారు.

# ఘనంగా శ్రీ బళ్ళారి రాఘవ 146వ జయంతోత్సవం



♦ పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ నివాళి

పుట్టపర్తి, ఆగస్టు 2 అనంత సూర్య:ప్రముఖ నాటక కళాకారుడు, తెలుగు నాటకరంగ పితామహుడు శ్రీ బళ్ళారి రాఘవ 146వ జయంతోత్సవాన్ని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బళ్ళారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ, తెలుగు నాటకరంగానికి శ్రీ బళ్ళారి రాఘవ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కళ పట్ల ఆయనకున్న అంకితభావం, సామాజిక చైతన్యంతో కూడిన నటన నేటి తరానికి ఆదర్శ్ర-పాయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, కళా సేవలను యువత స్ఫూర్తిగా తీసుకుని తెలుగు నాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది, పర్యాటక శాఖ ప్రతినిధులు పాల్గొని బళ్ళారి రాఘవ సేవలను స్మరించుకున్నారు.

# మీకోసం' 1100 సేవలను సద్వినియోగం చేసుకోండి: జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం, ఆగస్టు 2 అనంత సూర్య:ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 'మీకోసం' టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ కోరారు. ఇప్పటికే దాఖలు చేసిన ఫిర్యాదుల స్థితిగతులను తెలుసు కోవడానికి 1100కు కాల్ చేయవచ్చని, అలాగే వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆగస్టు 3, సోమవారం ఉదయం 9 గంటలకు అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక , రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన పత్రాలతో పాటు, గతంలో దరఖాస్తు చేసి ఉంటే పాత రసీదు లేదా అర్జీ స్లిప్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వ్యక్తులకు జిల్లా పోలీసుల కౌన్సెలింగ్

**- నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**



పుట్టపర్తి, ఆగస్టు 2 అనంత సూర్య:జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, సస్పెక్ట్ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. సీకేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ధర్మవరం డీఎస్పీ మాట్లాడుతూ, నేరప్రవర్తనను పూర్తిగా విడనాడి సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే అదనపు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమని పోలీసులు స్పష్టం చేశారు..

# ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జన్మదినం సందర్భంగా అక్కమ్మ దేవాలయంలో
## మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు





**♦ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలి.. ప్రజలు సుభిక్షంగా ఉండాలి..**
**♦ చంద్రబాబు మరో 20 ఏళ్లు ముఖ్యమంత్రిగా సేవలందించాలి: మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**

పుట్టపర్తి, ఆగస్టు 2 అనంత సూర్య:రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో 20 సంవత్సరాలు ప్రజలకు సేవలందించాలని, పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవాలని అక్కమ్మ దేవతను ప్రార్థించినట్లు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లి గ్రామ అటవీ ప్రాంతంలోని ప్రసిద్ధ అక్కమ్మ దేవత ఆలయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయం బాగా పండాలని, రైతులు ఆనందంగా జీవించాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వంపై అక్కమ్మ దేవత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీర్ఘకాలం ప్రజలకు సేవలందించాలని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నాయకత్వంలో పుట్టపర్తి నియోజకవర్గం విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, సంక్షేమ రంగాల్లో ఆదర్శంగా నిలిచి రాష్ట్రంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకోవాలని ప్రత్యేకంగా అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఆలయానికి చేరుకున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి అక్కమ్మ దేవత ఆలయ పూజారులు, భక్తులు ఉరుములు, మేళతాళాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఎద్దుల బండిపై ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, సహకార సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, నాగరాజు, పుల్లప్ప, మహేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ పూజారులు, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని చింతల గంగమ్మ అమ్మవారికి బోనాల సమర్పణ.

**అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు.**



నంబులపూలకుంట, ఆగస్టు 2,అనంత సూర్య:నంబులపూలకుంట లోని చింతల గంగమ్మ అమ్మవారిని రెడ్డివారిపల్లి, చిన్నసానువారిపల్లి గ్రామాల ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతుల పంటలు బాగా పండి , సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, పండ్లు, కొబ్బరికాయలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయం సుభిక్షంగా సాగాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. పూజా కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం హారతులు ఇచ్చి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఏడాది సంప్రదాయంగా చింతల గంగమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు,యువకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

# ఎర్రవంకపల్లిలో ఘనంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలు



ముదిగుబ్బ,ఆగస్టు 2, అనంత సూర్య:శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం పరిధిలో ఉన్న ఎర్రవంకపల్లిలో తెలుగుదేశం పార్టీ మాజీ సర్పంచ్ సీనియర్ నాయకుడు అన్నం నరసింహులు వెంకట్ శివారెడ్డి వీరి ఆధ్వర్యంలో ఎర్రవంకపల్లి రామస్వామి దేవాలయంలో పుట్టపర్తి శాసనసభ్యురాలు శ్రీమతి పల్లె సింధూర రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు వేడుకలు చాలా ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యువత తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పల్లె సింధూర రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుతూ భోజన వసతి గ్రామ ప్రజలకు ఏర్పాటు చేసి చాలా ఘనంగా శుభాకాంక్షలు వేడుకలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో అన్నం సూర్యనారాయణ నాగరాజు ఆంజనేయులు( అలియాస్) అంజి వెంకట శివయ్య చంద్రమోహన్ కే సూర్యనారాయణ కే రాము డి నారాయణ బండి రమణ గంగులప్పా చలమయ్య ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యనారాయణ తెలుగుదేశం పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శుభ, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి




పుట్టపర్తి/కొత్తచెరువు, ఆగస్టు 2 అనంత సూర్య:పుట్టపర్తి మండలం చెర్లోపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదివారం విస్తృతంగా పర్యటించి పలు శుభ, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి చెందిన గంగిరెడ్డి కుమార్తె జ్యోష్ణ, మదన్ మోహన్ రెడ్డిల వివాహ వేడుకకు హాజరైన శ్రీధర్ రెడ్డి నూతన దంపతులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు .అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న చాకల వీరనారాయణప్ప, వీరారెడ్డి భార్య శాంతమ్మలను వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెబుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బైకి చిన్న బయన్న (58) కుటుంబాన్ని కూడా శ్రీధర్ రెడ్డి సందర్శించారు. మృతుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుట్టపర్తి, ఆగస్టు 1 అనంత సూర్య:జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఆస్పత్రుల ఎండీలు, వైద్యులతో కలిసి ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి రహత్ పథకంపై కలెక్టర్ అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాద బాధితులకు 24 గంటల్లోపు ఆస్పత్రిలో చేరితే గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు, ఏడు రోజులపాటు నగదురహిత అత్యవసర వైద్య చికిత్స అందించే ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి రోడ్డు ప్రమాద బాధితుడిని తప్పనిసరిగా పథకం కింద నమోదు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చికిత్సను నిరాకరించరాదని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్' లో చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డా. ఎం. శ్రీదేవి, డీసీహెచ్ఎస్ డా. మధుసూదన్, డీఎంహెచ్‌వో డా. ఫైరోజ్ బేగం, డీపీఎంఓ డా. పద్మజ, టీమ్ లీడర్లు, వైద్య మిత్రలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంతో గుడిసెలు దగ్ధం.

**♦ ఐదు లక్షల ఆస్తి నష్టం**



అమరాపురం,ఆగస్టు 2,అనంత సూర్య:శ్రీ సత్య సాయి జిల్లా అమరాపురం మండలం పుల్లీకుంట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున అకాస్మాత్తుగా అగ్గి కి రెండు గుడిసెలు దగ్ధమయ్యాయి. బాధితులు నందీష్, రత్నమ్మ తెలిపిన వివరాల మేరకు రోజు మాదిరిగా భోజనం అనంతరం పనుకున్నామన్నారు. ఉదయం 4 గంటల సమయంలో పెద్ద శబ్దం వచ్చిందన్నారు. వెంటనే బయటికి చూడగా అగ్గి రాదికొన్నారు,దూరం వచ్చారు. దీంతో మొత్తం రెండు గుడిసెలు కాలి బూడిద అయిందన్నారు. సుమారు 5 లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. నందిస్ ఇంట్లో 90 వేల రూపాయలు,బంగారం చేతి ఉంగరం,చెవి జుమికలు,బట్టలు, బియ్యం తదితర వస్తువులు కాలి బూడిద అయినట్లు వారు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి జరిగిన నష్టానికి నష్టపరిహారం ఇవ్వాలని వారు కోరారు. ఈ విషయమై మండల విద్యుత్ అధికారులు ఏఈ సిద్దేశ్వర,లైన్మెన్ నవీన్ హుటా హుటిన సంఘటన స్థలానికి వెళ్లి ఏ విధంగా ప్రమాదం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ షాక్ తో గుడిసె కాలి పోలేదని ఆయన తెలిపారు.



# ప్రతి పాడి రైతుకు సబ్సిడీ దాణా అందించాలి



**♦ దాణా సరఫరా పెంచి రైతులందరికీ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వానికి సీపీఐ డిమాండ్**
**♦ "రూ.560కే దాణా.. కానీ అందరికీ అందని దాణా".**

నంబులపూలకుంట, ఆగస్టు 2,అనంత సూర్య:నంబులపూలకుంట మండలంలోని ప్రతి అర్హత కలిగిన పాడి రైతుకు ప్రభుత్వం సబ్సిడీపై పశు దాణా అందజేయాలని సీపీఐ జిల్లా నాయకులు సూర్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాల వద్ద నిర్వహించిన సబ్సిడీ పశు దాణా పంపిణీ కార్యక్రమాన్ని సీపీఐ నాయకులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వేల సంఖ్యలో పాడి ఆవులు,గేదెలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ దాణా రైతుల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. దీంతో చాలామంది రైతులు ప్రైవేటు దుకాణాల్లో ఒక్కో దాణా బస్తాను సుమారు రూ. 1,200 వరకు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందని చెప్పారు. అదే ప్రభుత్వం సబ్సిడీపై అందించే దాణా రూ. 560కే లభించడం రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనంగా మారుతోందన్నారు. పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి అర్హత కలిగిన రైతుకు సబ్సిడీ దాణా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దాణా పంపిణీలో పారదర్శకత పాటించడంతో పాటు ప్రతి రైతు సేవా కేంద్రంలో తగినంత నిల్వలు ఉంచాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా దాణా సరఫరాను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాడి పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందని, పశుపోషణ ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మరింత ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజారెడ్డి, నాయకులు అమీర్,ఇలియాజ్, రైతులు ఈశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి,రాజారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గౌడనకుంట గ్రామంలో బూత్ 12 లో 100% డోర్ టూ డోర్ పూర్తి విజయవంతం


**తెదేపా మండల అధ్యక్షులు కృష్ణమూర్తి.**

అమరాపురం,ఆగస్టు02,అనంత సూర్య:శ్రీ సత్య సాయి జిల్లా తమ్ముడే పల్లి పంచాయతీ పరిధి గౌడన్న కుంట గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు ఆదివారం ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి డోర్ టూ డోర్ కార్యక్రమం 100% పూర్తి చేయడం జరిగిందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ కే.ఆర్ రామలింగప్ప,రేషన్ డీలర్ నాగరాజు,బూత్ సీఈవో కన్వీనర్ అశోక్, నవీన్ కుమార్,కె ఎస్ ఎస్ కమిటీ సభ్యులు మహాన్తేష్,నాగేంద్ర ప్రసాద్ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



# గ్రామస్థాయిలో విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తాం

-విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు
- ప్రభుత్వంతో మాట్లాడి వృత్తిదారులకు రుణ సదుపాయం ఏర్పాటు చేస్తాం
- ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కన్వీనర్ గా విబి భాస్కర్ బాబు



అనంతపురం, ఆగస్టు 02 అనంత సూర్య : గ్రామ-స్థాయిలో అన్యాయం అవుతున్న పేద విశ్వబ్రాహ్మణులని వారి సమస్యలను ఎలుగెత్తి చాటాలన్న ఆలోచనతో ఉమ్మడి జిల్లా మొత్తం అన్ని నియోజకవర్గాలకు బలమైన జిల్లా నాయకత్వాలు కావలసిన అవసరం ఉందని విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా సీనియర్ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, అనంతపురం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ధర్మకర్తలు బ్రహ్మశ్రీ పేరుసోమల గురు ప్రసాద్ ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించిన విశ్వబ్రాహ్మణలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు కార్యక్రమం ఆలయ గౌరవాధ్యక్షులు ఎస్ఆర్ నాగభూషణం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షులు ధనలకోట వాసు, రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తాటికొండ రంగబాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రమోషన్ ఆఫీసర్ యశ్వంత్, ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల మండలాల మాజీ అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ నాయకులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని తన భుజస్కందాలపై వేసుకుని జిల్లాలోని విశ్వబ్రాహ్మణ పంచ వృత్తిదారులు, వడ్రంగి, స్వర్ణకారులు, కంచర వృత్తి దారులు, శిల్పకారులు, కమ్మరి వృత్తిదారులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, ప్రభుత్వంలో ఉన్న అధికారులు పౌరోహిత్యం చేస్తున్నటువంటి అందరిని సమన్వయపరచుకునేలా ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కమిటీలు ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్ గా ఎన్నికైన వీబి భాస్కర్ బాబు విశ్వ బ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు పేరుసోముల గురు ప్రసాద్, ఎస్ ఆర్ నాగభూషణం సమక్షంలో కన్వీనర్ గా ఎందుకు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గా ఎన్నికైన విబి భాస్కర బాబు మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం ఇచ్చిన పెద్దలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక పాలసీ విధానంలో వడ్రంగి వృత్తిలో, బంగారపు గుర్తులు అవకాశం ఉన్న ప్రతి ఒక్కరికి జిల్లా పరిశ్రమల అధికారితో, రాష్ట్ర ప్రభుత్వాధికారంతో మాట్లాడి రుణ సదుపాయం రాబోయే రెండేళ్లలో కల్పించాలని ఈరోజు జరిగిన కార్యక్రమంలో తీర్మానించడం జరిగిందని తెలియజేశారు.

# ఉయ్యూరు లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను 2 లేక 3 నెలల్లో పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తాం

## తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు వైవిబి. రాజేంద్రప్రసాద్



ఉయ్యూరు అనంత సూర్య: డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు టౌన్ పార్టీ అధ్యక్షులు జంపాన గురునాధరావు ఆధ్వర్యంలో ఉయ్యూరు లోని 14వ వార్డులో పర్యటించి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకొని, త్వరలోనే వాటన్నిటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రాజేంద్రప్రసాద్. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 2014 టు 2019 మధ్యలో మొదలు పెట్టి 80% పూర్తయిన టిడ్కో ఇళ్లను వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పూర్తిగా పాడుపెట్టారని, మరల మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులన్నీ మొదలు పెట్టామని, త్వరలో ఆ పనులన్నీ పూర్తి చేసి వచ్చే రెండు లేక మూడు నెలల్లో లబ్ధిదారులకు అందిస్తామని రాజేంద్రప్రసాద్ తెలియజేసినారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిడ్కోఇళ్లను ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ఐటీ బివిద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ బాబు ప్రత్యేక విజిట్ చేస్తూ త్వరలోనే లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తున్నారని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు జంపాన పూర్ణచంద్రరావు, అబ్దుల్ కుదూస్, జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్, తెదేపా సీనియర్ నాయకులు రత్నం బుజ్జి, తెదేపా నాయకులు జంపన వీర శ్రీనివాస్, 14 వార్డు కౌన్సిలర్ దుర్గాప్రసాద్, మాజీ కౌన్సిలర్లు పరిమి సలోమి సంతోషి, తెనాలి పద్మావతి,కోరాడ వెంకటలక్ష్మి, నడిమింటి పైడయ్య, మాదినేని జ్యోతి, చలపాటి మణికంఠ, బొర్రా సుబ్బారావు, లక్ష్మణరావు, కటారి తిరుపతిరావు, రామనోళ్ళ శ్రీకాంత్, చింతయ్య, జంపాన అర్జున్ రావు, ఆరేపల్లి సుబ్బారావు, రాజులు పాటి వెంకట్, ఆశా దేవి, మోదుగు మోడీ కుటుంబరావు, కొలగాని సాంబశివరావు,చిట్టీ తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 15 వరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదు గడువు పెంపు



వ్యవసాయ అధికారి నాగరాజు

అగళి,ఆగస్టు 02, అనంత సూర్య:అగళి మండలంలోని రైతులు పంటలు సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా మరియు ఈ పంట నమోదు చేసుకోవాలి.ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద మొక్కజొన్న,రాగి, కంది,ఆముదం,వరి సాగు చేసే రైతులు భీమా చెల్లించటానికి ఈ ఆగస్టు 15 వరకు గడువు పెంచడం జరిగిందని కావున అగళి మండలంలోని రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఖరీఫ్ 2026 ఎకరాకు మొక్కజొన్నకు రూ.165, కందులకు రూ.102, రాగి,ఆముదానికి రూ.100, వరికి రూ. 200 ఈ ఆగష్టు 15 వ తారీకు లోపు భీమా చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకోవాలని, ఇందులో భాగంగా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు ఒకసారి బ్యాంకులకు వెళ్లి ఇన్సూరెన్స్ అయిందో లేదో చెక్ చేసుకోవాలి, మీరు ఏ పంట అయితే వేసి ఉంటారో అదే పంటకు రుణాలు తీసుకొని ఇన్సూరెన్స్ చేసి ఉండాలి,చెక్ చేసుకొని పంటలలో ఏమైనా మార్పులు ఉంటే చెక్ చేసుకోవాలి అదే విధంగా రుణాలు తీసుకొని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ల ద్వారా గాని మీ సేవలో కానీ వాళ్ళ ఆధార్ కార్డు,భూమి పాస్ బుక్,బ్యాంక్ అకౌంట్,పంట ధ్రువీకరణ పత్రం తీసుకొని సెల్ఫ్ డెకరేషన్ ఇచ్చి వాళ్లు పండించే పైన తెలిపిన పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాల్సిందిగా, అలాగే రైతులు వేసిన ప్రతి పంటను కూడా రైతు సేవ కేంద్ర సిబ్బంది ద్వారా ఈ పంట నమోదు చేసుకోవలసినదిగా ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని అగళి మండల వ్యవసాయ అధికారి నాగరాజు రైతులకు తెలియ జేశారు.

# ప్రఖ్యాత రంగస్థల మహనీయుడు బళ్ళారి రాఘవ



చిత్తూరు,ఆగస్టు 2అనంత సూర్య:తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలందించిన ప్రముఖ రంగస్థల నటుడు, సంఘ సంస్కర్త బళ్ళారి రాఘవ సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) కే. మోహన్ కుమార్ పేర్కొన్నారు. బళ్ళారి రాఘవ జయంతి సందర్భంగా ఆదివారం చిత్తూరు కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించిన బళ్ళారి రాఘవ అసలు పేరు తాడిపత్రి రాఘవాచార్యులు అని తెలిపారు. శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన కుటుంబంలో జన్మించిన ఆయన బాల్యం నుంచే విద్యాభ్యాసంలో ప్రతిభ కనబరిచారని, అనంతరం న్యాయ విద్యను అభ్యసించి న్యాయవాదిగా కూడా సేవలందించారని చెప్పారు. తెలుగు, కన్నడ నాటకరంగాలకు బళ్ళారి రాఘవ చేసిన సేవలు అపూర్వమని, సహజ నటనకు ఆయన కొత్త ఒరవడిని తీసుకొచ్చారని డీఆర్ఓ కొనియాడారు. పాత్రలో జీవించి నటించడం ద్వారా ప్రేక్షకులను అలరించిన మహానటుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నాటకరంగ అభివృద్ధి కోసం తన సమయాన్ని, సంపదను అంకితం చేసిన గొప్ప కళాసేవకుడిగా బళ్ళారి రాఘవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ప్రస్తుత తరానికి ఆయన జీవితం, సేవలు ఆదర్శప్రాయమని, కళలను సమాజ చైతన్యానికి సాధనంగా ఉపయోగించిన మహోన్నత వ్యక్తిగా బళ్ళారి రాఘవను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఆర్ఓ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి ఏ.ఎం. నరేంద్ర కుమార్, టూరిజం మేనేజర్ గౌరీ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొని బళ్ళారి రాఘవకు నివాళులర్పించారు.

# అంబేద్కర్ గురుకుల పాఠశాల లో సైన్స్ పాఠాలు బోధించిన బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డా. డి. శ్రీనివాస మూర్తి

అగళి,ఆగస్టు 02, అనంత సూర్య:రోళ్ల మండలం లోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డా.డి. శ్రీనివాస మూర్తి విద్యార్థులతో ప్రత్యేకంగా మమేకమై సైన్స్‌పై అవగాహన కల్పించారు.మానవ శరీర నిర్మాణం, అంతర్గత అవయవాల పనితీరు,సైన్స్ నమూనాలు,శాస్త్రీయ దృక్పథం వంటి అంశాలను సరళమైన ఉదాహరణలతో వివరించారు.అదేవిధంగా బాలల హక్కులు,నాణ్యమైన విద్య,వ్యక్తిగత పరిశుభ్రత,ఆరోగ్యం, క్రమశిక్షణ,నైతిక విలువలు,వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.కొంతసేపు పాఠశాల ఆవరణ సైన్స్ బోధన,బాలల హక్కులపై అవగాహన, విద్యార్థులతో ప్రత్యక్ష సంభాషణకు వేదికగా మారింది.ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ ప్రధానోపాధ్యాయులు కళాశాల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.





# (ఐ యు డి డబ్ల్యూ జె) జిల్లా కార్యదర్శి గ ఎన్నికైన ప్రభ న్యూస్ విలేఖరి హారున్ రషీద్ ఖాన్ కు ఘన సన్మానం



ముదిగుబ్బ,ఆగస్టు 2, అనంత సూర్య:ముదిగుబ్బ మండల కేంద్రంలోని ఇండిపెండెంట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఐ యు డబ్ల్యూజే )శ్రీ సత్య సాయి జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ముదుగుపు ప్రభ న్యూస్ విలేఖరికి హారున్ రషీద్ ఖాన్ కు ముదిగుబ్బ మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి తుమ్మల మనోహర్ నాయుడు సిపిఐ పార్టీ ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ముదిగుబ్బ మండల విలేకరుల యూనియన్ సంఘం మరియు మలక వేమల తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి మల్లికార్జున ప్రముఖ తెలుగుదేశం పార్టీ కార్యకర్త మాదాసు గంగాధర్(ఎంఎ) వీరందరితో కలిసి ఆదివారం కేక్ కట్ చేసి హారున్ రషీద్ ఖాన్ కు శాలువాలతో ఘన సన్మానం చేశారు అదేవిధంగా భోజన వసతి కల్పించారు రషీద్ ఖాన్ మాట్లాడుతూ ముందుగా ఉమ్మడి రాష్ట్ర కమిటీ నా పైన నమ్మకం ఉంచి శ్రీ సత్య సాయి జిల్లా - ఐ యు డబ్ల్యూ జె కార్యదర్శిగా నాపైన నమ్మకం ఉంచి ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లా మండలాలలోని మరియు ముదిగుబ్బ మండలంలోని ఏలేఖరికి ఏ సమస్య వచ్చినా రాష్ట్ర కమిటీ ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు.

# కిలారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో కన్నుల పండుగగా పల్లె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలు



కొత్తచెరువు,ఆగష్టు 02, అనంత సూర్య:పుట్టపర్తి శాసన సభ్యురాలు మొట్టమొదటి మహిళ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కిలారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించాడు. ఆదివారం మైలసముద్రం గ్రామంలో కేక్ ను కట్ చేసి ఎమ్మెల్యే కు పుట్టినరోజు రోజు శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ సందర్భంగా కిలారి శ్రీనాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమ పథకాలు ప్రజాసమస్యలు తీరుస్తూ,ఎన్నడు లేనటువంటి విధంగా నియోజక వర్గాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తూ, కాబోయే మంత్రి బాటలో ముందు ఉన్నారు అని కిలారి శ్రీనాథ్ తెలియజేశారు.

# గౌకనపల్లిలో విషాదం

## వ్యవసాయ అప్పుల బాధతో రైతు ఆత్మహత్య..



నంబులపూలకుంట, ఆగస్టు 2, అనంత సూర్య:నంబులపూలకుంట మండలంలోని గౌకనపల్లి గ్రామంలో వ్యవసాయ అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌకనపల్లి గ్రామానికి చెందిన రేపన వెంకటేశు (45), తండ్రి రేపన రామయ్య, వ్యవసాయ సాగు కోసం అప్పులు చేశారు. అయితే పంటల సాగులో వరుస నష్టాలు రావడంతో అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురైన ఆయన ఆదివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో తన వ్యవసాయ పొలం సమీపంలోని వేప చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనను గమనించిన మృతుడి భార్యతో పాటు రేపన నారాయణ, రేపన వెంకటరమణ మరియు ఇతరులు కలిసి ఆయనను ఉరి స్థితి నుంచి కిందకు దించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు.ఈ ఘటనపై మృతుడి భార్య రేపన రమణజినమ్మ (39), గౌకనపల్లి గ్రామ నివాసి, ఆదివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పి. కృష్ణమూర్తి తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405